# మమతల పంజరం

## -సుజాతారావ్ వేముగంటి

''ఈ బొజ్జలో బుజ్జాయి వుందంటావా? బుజ్జోడు వున్నాడంటావా?'' అరుణ్ మాటలు గుర్తొచ్చాయి.

''ఛీ! బుజ్జోడా? నాకు బుజ్జాయే కావాలి'' అంది తను.

''నిజమే. కొడుకైనా కూతురైనా నా ఆశయాలకు అనుగుణంగా పెంచుతాను. శ్రమజీవన సౌందర్యాన్ని, సాటి మనిషిపై సానుభూతిని వాళ్లకి చిన్నప్పట్నుంచీ అలవాటు చేస్తాను'' అరుణ్ అనేవాడు.

ఏమిటో అరుణ్ మాటలు ఒక పట్టాన అర్థమయ్యేవి కావు. జీవితమంటే ఘర్షణ, కన్నీళ్లు అంటాడు. ఒక్కరోజైనా కడుపు మాడ్చుకుని ఆకలి ఎలా వుంటుందో రుచి చూడడమే జీవితాన్ని తెలుసుకోవడం అంటాడు. అతని మాటలూ, ఆశయాలు అన్నీ అప్పట్లో తనకి చాలా థ్రిల్లింగ్‌గా వుండేవి. ఒక మేధావిని చూస్తున్నంత గొప్పగా వుండేవి. అతన్ని చూస్తుంటే అతని ప్రేమకన్నా విలువైనది ఈ ప్రపంచంలో ఏమీలేదని మురిసిపోయేది.

''హలో! అలసటగా వుందా?'' డాక్టర్ మాటలకు ఈలోకంలోకి వచ్చింది. డాక్టర్ చెకప్ చేసి ''రేపటికల్లా డెలివరీ అయిపోతుంది'' అంది.

బిందు జవాబివ్వలేదు.

''చూడమ్మా! ఎక్కువ ఆలోచించక హాయిగా పడుకో. రేప్పొద్దున సుధ వచ్చి నీ దగ్గరే వుంటుంది. సరేనా'' అంది డాక్టర్.

తన క్లాస్‌మేట్ సుధ అమ్మ ఈ డాక్టర్ అని ఈ నర్సింగ్‌హోంలో చేర్పించింది. ఓ పదినిముషాలు మాట్లాడి వెళ్లిపోయిందామె.

మళ్లీ ఆలోచనలు. ఈరోజెందుకో అరుణ్ బాగా గుర్తుకు వస్తున్నాడు. అవును మరి. అతని బిడ్డకు జన్మనివ్వబోతోందిగా! ఇప్పుడు అరుణ్ ఏం చేస్తున్నాడో? ఏమో? తామిద్దరూ విడిపోయి దాదాపు ఆరునెలలు దాటిపోయింది. హఠాత్తుగా కరెంటు పోయినట్లుంది. మరుక్షణం జనరేటర్ ఆన్ చేసిన చప్పుడు...మళ్లీ ఫ్యాన్ తిరుగుతున్న శబ్దం.

అవునూ ఇప్పుడు అమ్మ, నాన్న ఏం చేస్తున్నారో?

మా ఇంటి మహాలక్ష్మి అంటూ తనని ఎంత గారాబంగా పెంచారు? ''మా బిందు, మా కంటిపాప'' అంటూ ఎప్పుడూ ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే తల్లిదండ్రులు. పెద్ద అంతస్తు, హోదా వున్న కుటుంబం నుంచి వచ్చిన తను, ప్రేమ అంటూ ఒక మామూలు వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ప్చ్! అరుణ్‌ను చేసుకుని అమ్మానాన్నలకు దూరమైపోయింది.

అభిప్రాయాలు కలవక అరుణ్‌తో తెగతెంపులు చేసుకుంది. అయినా అరుణ్ తననేం మోసం చేయలేదే? అక్కడికీ 'నీ అంతస్తు, నా అంతస్తు కుదర'దన్నాడు ఎన్నోసార్లు. 'వద్దు. నా ఆశయాలు అవీ నీకు అంతుబట్టవు. నీకు అర్థం కూడా కావు' అన్నాడు. కానీ తనే అతనెన్నిసార్లు చెప్పినా విన్లేదు. కాలేజీలో హీరోగా వెలిగిపోతున్న అరుణ్ వెంటపడి, వేధించి చివరికి అతని మదిలో స్థానం సంపాదించుకుంది. అమ్మానాన్నలకు తెలియకుండా స్నేహితుల సమక్షంలో అరుణ్ అర్ధాంగి అయింది. అమ్మానాన్న నిశ్శబ్దంగా, నిర్వికారంగా వుండిపోయారు. తను చేసిన పనికి వాళ్లిద్దరూ షాకయ్యారు. ఒకప్పుడు మా ఇంటి మహాలక్ష్మి అన్నవాళ్లే ఆ తరువాత నా కడుపులో చెడబుట్టావు అన్నారు. ఆత్మాభిమానం ఎక్కువ వున్న తను అరుణ్‌తో కల్సి వెనక్కి వచ్చేసింది.

పెళ్లయిన కొద్దిరోజులకే అరుణ్ ఏమిటో అర్థం కాసాగింది. అతను అందర్లాంటి మగవాడు కాదనీ, సినిమాలు, షికార్లు, సరదాలు లేని అసంతృప్తి వైవాహిక జీవితం తనని చాలా చికాకు పరిచేవి. ఎప్పుడూ గదిలోనే కూర్చుని పుస్తకాలు చదువుతూ సిగరెట్లు తాగుతూ స్నేహితులతో ఉద్యమాల గురించి చర్చిస్తుండేవాడు.

కాలక్రమంగా పెళ్లి- ప్రేమ తాలూకు అతవలివైపు నాణెం అర్థమవుతున్న సమయంలో నెలతప్పింది. పుట్టబోయే పాపాయి నా ఉద్యమాలకు ప్రతిరూపం అన్నాడు.

''అరుణ్! ఇప్పటికైనా నీ ఉద్యమ ఆలోచనల్ని మాని మన భవిష్యత్తు ప్రణాళిక గురించి ఆలోచించు'' అంటే-

''పిచ్చిమొద్దూ!'' అని చిన్నగా నవ్వేసాడు. ఎంత ఉక్రోషం వచ్చిందని? అరుణ్ మాత్రం ఏమీ మారలేదు.

ఈ పార్టీలు, ఉద్యమాలు తిండి పెట్టలేవు. ఆర్థిక బాధ అవగతమవుతున్నకొద్దీ అసహనం ఎక్కువైపోసాగింది. ఎందుకో ఏదో కోల్పోతున్న ఫీలింగ్ బలీయమవుతోంది.

అరుణ్‌తో ప్రపంచం. ఇక మారడు. జీవితంలో సుఖపడే మార్గాలు ఎన్ని వున్నా వాటిని కాదని ఎలా కష్టపడాలో అని ఆలోచనలు. అలాగే చేస్తాడు. పుట్టబోయే పిల్లలైనా ఆకలితో అలమటించకూడదు కదా అని అంటే-

''నా మనసునీ, నా ఆశయాలీన్ని ఇన్నేళ్ల పరిచయంలో నీవేమాత్రం అర్థం చేసుకోలేకపోయావు'' అన్నాడు. మాట్లాడుతూ మాట్లాడుతూ చాలా మూడీగా అయిపోయేవాడు. వున్నట్టుండి గబుక్కున లేచి ఎక్కడికో వెళ్లిపోయేవాడు. ఆనాడు గమ్మత్తుగా, థ్రిల్లింగ్‌గా అనిపించిన అరుణ్ ఆశయాలు ఎందుకో ఇప్పుడు బోర్ కొడుతున్నాయి. అంటే తను అరుణ్‌ని ప్రేమించలేదా? కాలేజీ హీరోగా వున్న అరుణ్‌తో స్నేహం, ప్రేమ కేవలం తన ఇగో తృప్తిపరచుకోవడం కోసమే చేసిందా?

★★★

''బిందూ'' అరిచాడు అరుణ్.

''అవును అరుణ్. నాకీ జీవితం ఎందుకో నిర్లిప్తంగా, నిస్సారంగా వుంది. నాతో ఏమీ మాట్లాడవు. అదే నీ స్నేహితులతోనైతే మాటలు వరదలా వస్తాయి. నాకేమో నీతోపాటు సరదాగా సినిమా కెళ్లాలని, నీకేమో ఉద్యమాల్లో, సమ్మెల్లో, స్నేహితులతో గడపాలని వుంటుంది. నీకు ఈ మనుషులమీద, ఈ వ్యవస్థమీద నమ్మకంలేదు. నాకేమో అపారమైన నమ్మకం. నీ అభిప్రాయాల్ని చాలా దృఢంగా నమ్ముతావు. వాటి చుట్టూ ఒక పటిష్టమైన గోడ నిర్మించుకున్నావు. పార్కుల్లోని ప్రకృతిని చూసి నేను పరవశిస్తే ఆ పార్కుల్లో ఎండల్లో కాల్తున్న పసిపిల్లలను చూసి కరిగిపోతావు. నీ మనసులో ఆ పాప పట్ల ప్రేమ, కరుణ స్రవించడానికి బదులు ఆ పరిస్థితులు కల్పించిన చుట్టూ వున్న వ్యక్తులపట్ల ద్వేషం పెంచుకుంటావు. ఇన్నేళ్ల మన అనుబంధంలో నేను నిన్ను అర్థం చేసుకున్నది ఒక్కటే. నీ మనసు నాది కాదు, నీ ప్రపంచం వేరు, నా లోకం వేరు. ఇద్దరం భిన్నధృవాలం'' నిస్సంకోచంగా చెప్పింది బిందు.

''ఈ విషయాలన్నీ నేను ఎప్పుడో చెప్పాను. కానీ నువ్వేమన్నావ్? ప్రేమకు అలాంటి తేడాలు లేవన్నావ్. నీవెలా వున్నా నాకిష్టమే అన్నావు. నీ ప్రక్కన నేనుంటే చాలన్నావ్. నీనుంచి నేను పారిపోతుంటే నా వెంటపడి నన్ను ఆకర్షించి నీవాడిని చేసుకున్నావు. నన్ను పూర్తిగా అర్థం చేసుకున్నావనుకున్నాను. కానీ...కానీ ఈ వ్యవస్థలో ప్రేమ, ఆత్మీయత, అన్నీ తూకపురాళ్లే'' అరుణ్ కళ్లల్లో నీళ్లు.

''కనీసం కడుపులో పెరుగుతున్న నా రూపం సంగతి ఏం చేస్తావ్?'' సూటిగా అడిగాడు.

''అబార్షన్ చేయించుకుంటాను'' తల దించుకుని చెప్పింది. నవ్వాడు అరుణ్. గుండెలను కోసే విషాదం వుంది ఆ నవ్వులో.

''బిందూ! నీ జ్ఞాపకంగా నేను వాడిని పెంచుకుంటాను. పుట్టబోయే నా బిడ్డమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. ఆ విషయం నీకూ తెల్సు'' అన్నాడు.

''ఐయామ్ సారీ అరుణ్. నేను అంత రిస్కు తీసుకోలేను. నీ ప్రతిరూపంగా ఈ బిడ్డను కంటాను అనే మెలోడ్రామా నేను ఆడలేను. నేనేంటో నా గమ్యమేమిటో నిర్దే

శించే హక్కు ఎవరికీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో నేను తొమ్మిది నెలలు బిడ్డను మోసి కనడం అనేది అసాధ్యం. వస్తా. గుడ్‌బై ఫరెవర్'' వచ్చేసింది. అరుణ్ ఏమీ మాట్లాడలేదు. స్థాణువులా అలాగే నిల్చుండిపోయాడు.

★★★

హాస్పిటల్‌లో అబార్షన్ కోసం టేబుల్ మీద కళ్లు మూసుకుని పడుకుంది బిందు. మూసుకున్న ఆ కనురెప్పల వెనుక ఏ ఆలోచనలున్నాయో తెలియడం లేదు.

''అమ్మా!'' అనే పిలుపు. ఉలిక్కిపడింది బిందు. ఎవరు? ఎవరు పిలిచారు తనని? చుట్టూ చూసింది.

''నేనమ్మా!'' బావిలో వున్నట్లు మెల్లగా వినిపించింది. ఆమె పేగుల్లో చిన్న కదలిక. శరీరంలో ప్రతి అణువు ఓ వింతైన అనుభూతితో నిండిపోయింది. అప్రయత్నంగా చేయి కడుపుమీదకి వెళ్లిపోయింది.

''ఎందుకమ్మా నేనంటే కోపం?'' దీనంగా వుందా స్వరం.

''నన్నెందుకు చంపాలనుకుంటున్నావమ్మా? చెప్పమ్మా?''

''కన్నా! నా కన్నా. వద్దు నాన్నా. అంత మాటనకు'' ఆమె కళ్లు వర్షిస్తున్నాయి. మనసు మూగగా రోదిస్తోంది.

''అమ్మా! నా మూలంగా బాధపడ్తున్నావ్. నా మూలంగానే నాన్నను విడిచి వచ్చేసావు. నన్ను ఇంతగా తప్పించుకోవడానికి నేనెందుకు దోషినమ్మా?'' పెదవులు బిగించి ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న ఆవేదనను నిగ్రహించుకుంది బిందు.

''నన్ను క్షమించు నాన్నా. నిన్ను నేను ఏమీ చేయను. నిన్ను బయటకు తీసుకు వస్తాను. నా గుండెల్లో దాచుకుంటాను. నీకే లోటు రాకుండా చూసుకుంటాను. నిన్ను ప్రపంచం గర్వించేలా పెంచుతాను'' నిశ్శబ్దంగా నవ్వినట్లనిపించింది.



★★★

దాహంగా వుంది. పక్కనేవున్న వాటర్ బాటిల్ అందుకునే ఓపిక లేక బెడ్‌పక్కనే వున్న స్విచ్ నొక్కింది.

మరుక్షణం తలుపు తీసుకుని నర్స్ వచ్చి ఏం కావాలని అడిగింది. బిందు మంచినీళ్లు కావాలని చెప్పింది. నర్స్ నీళ్లందించి ఓ ఐదు నిముషాలు కూర్చుని వెళ్లిపోయింది.

బిందు కళ్లు మూసుకుంది. అంతలోనే రెస్ట్‌లెస్‌గా ఫీలయింది. నడుములో సన్నగా ప్రకంపన ప్రారంభమయింది. అంటే నొప్పులు మొదలవుతున్నాయా? ఒక్క నిముషం కళ్లు మూసుకుంది. మూసిన కంటి నుంచి ఓ నీటిచుక్క ఆమెకు తెలీకుండానే చెక్కిలిపై జారిపడింది. క్రమంగా నొప్పులు ఎక్కువయ్యాయి.

''అమ్మా'' భరించలేని బాధతో అరిచింది బిందు. మనస్సూ, శరీరం రెండూ చిత్రవధ అనుభవిస్తున్నాయి. బాధతో మెలికలు తిరిగిపోతూ పక్కనే వున్న స్విచ్ నొక్కింది. నర్స్ హడావుడిగా వచ్చి ఆమెను చూసింది. బిందు బాధతో మెలికలు తిరిగిపోతోంది.

ఓ అరగంట నరకయాతన తరువాత విపరీతమైన నీరసం, అలసట. అంతలో బిందు ప్రక్కనే వెచ్చని స్పర్శ. తెల్లగా, బొద్దుగా, వత్తయిన నల్లని జుట్టుతో చిన్న చిన్న పిడికిళ్లు బిగించి లేలేత పెదవులు రవ్వంత తెరిచి నిద్రపోతున్నాడు బాబు.

ఆమెలో మాతృత్వం చెలియలి కట్ట దాటింది. అంతా అరుణ్ పోలికే. చిన్నప్పుడే ఇన్ని పోలికలతో ఉన్నాడు. పాలుకారుతున్న వాడి పెదవుల స్పర్శకు ఆమెలో నిద్రాణమైన భావాలు చైతన్యవంతమై ఎగిసిపడుతున్నాయి. శరీరం మొత్తం వీణాతంత్రులుగా మారి ఏవో రాగాలను ఆలపిస్తుంటే బాబు నుదుటిపై చిన్నగా ముద్దాడింది బిందు. పసివాడిని తన భావాలకు ప్రతినిధిగా పెంచి పెద్ద చేయాలనే నిశ్చయానికొచ్చిందామె ఆ క్షణంలో.

★